నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలి

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసే క్యాంటీన్‌ను పరిశీలించిన అనంతరం మహిళలతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 30: కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసే క్యాంటీన్‌లో పరిశుభ్రత పాటించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) రాధికాగుప్తా సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాల వారు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేయబోయే క్యాంటీన్‌ను మంగళవారం అమె పరిశీలించారు. అదనపు కలెక్టర్ మహిళలను వివరాలు అడిగి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్యాంటీన్‌కు వచ్చే వారికి నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే..ఉత్తమ బోధన

ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన జిల్లా సంక్షేమశాఖ అధికారి కృష్ణారెడ్డి

జవహర్‌నగర్, జూలై 30: ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ బోధన అందుతుందని, కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా విద్యార్థులకు డిజిటల్ పాఠాలు అందిస్తున్నామని జిల్లా సంక్షేమశాఖ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, దవాఖానాలను జిల్లా సంక్షేమశాఖ అధికారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ అధికారులు సమయపాలన పాటించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శించరాదని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నైపుణ్యతతో కూడిన విద్యనందిస్తూ, పౌష్టికాహారం అందజేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులు సంబవించే ప్రమాదం ఉందని, డాక్టర్లు మందులు అందుబాటులో ఉండాలని అన్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, దవాఖానా సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలను మోసం చేసిన కాంగ్రెస్‌ను గద్దె దింపాలి



బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా బీజేపీ నేతలు

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 30 : బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీలను మోసం చేసిన కాంగ్రెస్‌ను గద్దె దింపాలని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ ధర్నా నిర్వహించి, అనంతరం కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు మంగయ్య, మహేందర్‌యాదవ్, సదానంద్ గౌడ్, ఆంజనేయులు, వెంకటేష్, యాదగిరి, రవీందర్ గౌడ్, శంకర్, బాలరాజ్ యాదవ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలలో తిథి భోజనం

తిథి భోజన్ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న మున్సిపాలిటీ వైస్ చైర్మన్ రమేశ్, ఎంఈవో వసంతకుమారి

మేడ్చల్, జూలై 30: మేడ్చల్ పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో రోడ్డులో ఉన్న మండల ప్రాథమిక పాఠశాలలో మంగళవారం తిథి భోజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని మేడ్చల్ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చీర్ల రమేశ్, ఎంఈవో వసంతకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో వసంతకుమారి మాట్లాడుతూ సమాజాన్ని విద్యార్థులతో మమేకం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. పుట్టినరోజు, పెళ్లి రోజు, ఇతరత్రా ప్రత్యేక సందర్భాల్లో వ్యక్తులు, సంస్థలు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని, ఆహార వస్తువులను అందించడమే కార్యక్రమ లక్షమని తెలిపారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం మంజుల, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలి

కాప్రా, జూలై 30: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమపథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జి.దామోదర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సీపీఐ ఉప్పల్ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశం ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో కే. ధర్మేంద్ర అధ్యక్షతన జరిగింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 76 సంవత్సరాలు గడుస్తున్నా, నేటికీ దేశంలో ఆర్థిక అసమానతలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.శంకర్ రావు, సీపీఐ ఉప్పల్ మండల కార్యవర్గ సభ్యులు నారా నర్సింహ, బషీర్, రాజేందర్, టి.సత్యప్రసాద్, సతీష్‌కుమార్, కృపాకర్, జాన్, స్వామిదాస్,నర్సింగరావు, బిక్షపతి, మిరియాల సాయిలు, రజిని, గిరి బాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జి.దామోదర్‌రెడ్డి

ఆశ, జీపీ కార్మికుల అక్రమ అరెస్టులు దారుణం

మేడ్చల్ పోలీసులు అదుపులో ఆశ కార్యకర్తలు

ఆశకార్యకర్తలను అరెస్టు చేసిన శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఉంచినదృశ్యం

మేడ్చల్, జులై 30 : ఆశకార్యకర్తలు, గ్రామ పంచాయతీ కార్మికుల అక్రమ అరెస్ట్‌లు దారుణమని సీఐటీయూ జిల్లా కోధికారి ఉన్నీకృష్ణన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని మేడ్చల్, శామీర్‌పేట, మల్కాజిగిరి, బాలానగర్, కీసర, చీర్యాల, దుందిగల్, ఉప్పల్ ప్రాంతాల్లో ముందస్తుగా అరెస్ట్ చేసి ఆశ, గ్రామ పంచాయతీ కార్మికులను మేడ్చల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనీస వేతనం అమలు చేయాలని కోరితే ప్రభుత్వం పోలీసులను అర్ధరాత్రి కార్మికుల ఇండ్ల మీదికి పంపి, అక్రమంగా పోలీస్‌స్టేషన్‌లలో నిర్బంధించడం అన్యాయమన్నారు. పోలీస్‌స్టేషన్‌లో పెట్టి ధర్నా అడ్డుకోవడం రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. 15 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వ ఇచ్చిన హామీలను, కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన కనీస వేతనం రూ.18వేలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తే ఆశ కార్యకర్తలను అడ్డుకోవడం సరికాదన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులకు మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, జీవో నంబరు 51 ఉపసంహరించుకోవాలని, మున్సిపాలిటీ కార్మికులకు ఇచ్చినట్టు కనీస వేతనం జీవో 60 ప్రకారం రూ.16600 ఇవ్వాలనే డిమాండ్‌తో మహాధర్నాకు పూనుకుంటే వెళ్లకుండా చేయడం పూర్తిగా అప్రజాస్వామికమని ఆయన విమర్శించారు. అరెస్ట్‌లు, నిర్బంధాలతో ఉద్యోగుల, కార్మికుల ఉద్యమాన్ని అపలేరని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అప్రజాస్వామికంగా, నిరంకుశంగా వ్యవహరించే ప్రభుత్వాలకు పతనం తప్పదన్నారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకుడు కిష్టప్ప, ఆశా కార్యకర్తల సంఘం జిల్లా అధ్యక్షురాలు హేమలతతో పాటు అరెస్ట్ చేసిన దాదాపు 150 మంది ఆశా, గ్రామ పంచాయతీ కార్మికులను బేషరుతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

శామీర్‌పేట: ఆశ కార్యకర్తల వేతనాల పెంపుకోసం కోరికి తరలివెళ్లాలని పిలుపు మేరకు శామీర్‌పేట పోలీసులు శామీర్‌పేట మండలంలోని ఆశ కార్యకర్తలను ముందస్తుగా అరెస్ట్ చేయడంతో శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం సీఐటీయూ మండల నాయకుడు కిష్టప్ప ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లలిత, కవిత, పద్మ, మంజూల, జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంధ విద్యార్థులకు ఆర్థిక సాయం అభినందనీయం

అంధవిద్యార్థులకు ఆర్థిక సాయం చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా, జులై 30: చూపులేని విద్యార్థులకు లయన్స్‌క్లబ్, లయన్స్ హాస్పిటల్ ట్రస్ట్ కుషాయిగూడ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం చేయడం అభినందనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం ఏఎస్‌రావునగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నేత్ర విద్యాలయ జూనియర్ కళాశాలలో చదువుతున్న ఏఎస్‌రావునగర్‌కు చెందిన నవీన్, పూజిత అనే విద్యార్థులకు కంటి చూపులేని కారణంగా లయన్స్‌క్లబ్, లయన్స్ హాస్పిటల్ ట్రస్ట్ కుషాయిగూడ ఆధ్వర్యంలో రూ. 20వేల చెక్కును ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, లయన్స్ హాస్పిటల్ ట్రస్ట్ చైర్మన్ కొత్తరామారావు, డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, కుమారస్వామి , లయన్స్‌క్లబ్ అధ్యక్షులు రవిశంకర్‌రాజు, ఎల్లయ్య, కార్యదర్శి ఎం.ఎస్.పిల్లై, రాములు, యాదగిరి, సుందర్‌రాజు, పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన మున్సిపల్ చైర్మన్లు

మేడ్చల్ కలెక్టరేట్: అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికాగుప్తాను మంగళవారం మున్సిపల్ చైర్మన్లు చంద్రారెడ్డి, ప్రణీత శ్రీకాంత్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పూష్పగుచ్ఛం అందించి శుభకాంక్షలు తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే మల్లారెడ్డికి ఆహ్వానం

ఘట్‌కేసర్,జూలై30: మండల పరిధి ఏదులాబాద్ గ్రామలోని శ్రీగోదాదేవి రంగనాయక స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ రైతు సోసైటీ డైరెక్టర్ ధర్మారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పూజారుల,గ్రామస్తులు ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి మంగళవారం ఆహ్వాన పత్రికను అందజేశారు.

అక్రమ నిర్మాణాలను ఉపేక్షించం

అక్రమ కట్టడాలను కూల్చివేస్తున్న దృశ్యం

జవహర్‌నగర్,జూలై30: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు ఉపేక్షించబోమని, కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కాప్రా తహసీల్దార్ సుచరితా హెచ్చరించారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని అంబేద్కర్‌నగర్ ఇందిరమ్మ చెరువు శిఖంను మట్టితో నింపుతూ ఆక్రమణకు గురిచేస్తున్నారనే సమచారంతో మంగళవారం తహశీల్దార్ సుచరితా సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్పొరేషన్‌లో ఇప్పటికే 20మంది కబ్జాదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని తెలిపారు. ఇందిరమ్మ చెరువును కబ్జా చేయాలని చూస్తున్న అక్రమార్కులను వదిలేదేలేదని, చెరువుకు హద్దులు వేసి రక్షిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి, సిబ్బంది కాశీరాం, రవి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న మాజీ ఎంపీ వి. హనుమంతారావు

రామంతాపూర్,జూలై 30: ఉప్పల్ రాజీవ్ గాంధీ క్రికెట్ స్టేడియం ఆవరణలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 23అడుగుల విగ్రహం ఏర్పాటు కోసం మంగళవారం మాజీ ఎంపీ వి. హనుమంతారావు,రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి, ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జీ మందమూల పరమేశ్వర్‌రెడ్డిలు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఆగస్టు 20న సీఎం రేవంత్ రెడ్డి,ప్రియాంక గాంధీ చేతుల మీదుగా విగ్రహా ఆవిష్కరణ జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జ్ఞానేశ్వర్,లక్ష్మణ్‌గౌడ్,శ్రీకాంత్‌గౌడ్,సుధాకర్‌రెడ్డి,సుర్వి మురళీగౌడ్,రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించండి

డిపో మేనేజర్ కవితకు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ యూత్ నాయకులు

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 30: రాంపల్లి ప్రభుత్వ పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని బీఆర్ఎస్ యూత్ నాయకులు బందెల పరమేష్, సుభాష్‌గౌడ్ మంగళవారం చర్లపల్లి డిపో మేనేజర్ కవితకు వినతిపత్రాన్ని అందజేశారు.

చర్లపల్లి, కరీంగూడ నుంచి రాంపల్లి పాఠశాలకు వచ్చే విద్యార్థులకు సమయానికి బస్సులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. చర్లపల్లి నుంచి కరీంగూడ వరకు బస్సును ఏర్పాటు చేయాలని కోరారు. సరైన సమయానికి బస్సును ఏర్పాటు చేస్తానని డిపో మేనేజర్ చెప్పినట్లు వారు తెలిపారు.

కండక్టర్లు, డ్రైవర్లకు సన్మానం

ఏప్రిల్, మే, జూన్ నెలలో అత్యధిక ఇన్సెంటివ్ సాధించిన కండక్టర్లు, అత్యధిక ఇంధన పొదుపు చేసిన డ్రైవర్లు, బ్రేక్ డౌన్ లేకుండా బస్సులను నిర్వహించిన మెకానిక్‌లు, కార్మికులను డిపో మేనేజర్ సుధాకర్ శాలువా, ప్రశంసా పత్రాలను మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రామారావు, ఏఈ స్నేహలత, సూపరింటెండెంట్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

-మేడ్చల్, జూలై 30

గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్

శామీర్‌పేట,జూలై30: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ, పీజీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్ కోరారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు డిగ్రీలో చేరుటకు నేరుగా జగద్గిరిగుట్ట(శామీర్‌పేట) కళాశాలకు ఇంటర్ సర్టిఫికెట్లతో వచ్చి బీకామ్-సీఏ, బీకామ్-బీఏ, బీజెడ్‌సీ, ఎంజెడ్‌సీ, ఎంఎస్‌సీఎస్, ఎంఎస్‌డీఎస్ గ్రూపుల్లో చేరవలసినదిగా కోరారు.ఈ అవకాశాన్ని విద్యార్థులుసద్వినియోగంచేసుకోవాలని కోరారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మొక్కను నాటి మట్టిని పోస్తున్న హరిప్రసాద్‌రావు

ఘట్‌కేసర్,జూలై30: వనమహోత్సవంలో భాగంగా పోచారం మున్సిపాలిటీ సంస్కృతి టౌన్‌షిప్ అధ్యక్షుడు,12వ వార్డు కౌన్సిలర్ బి.హరిప్రసాద్‌రావు మంగళవారం టౌన్‌షిప్ ఖాళీ ప్రాంతాల్లో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ 5 మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు.

మహిళా శక్తితో ఆర్థిక పరిపుష్టి

సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 30 : మహిళల ఆర్థిక పరిపుష్టి కోసం ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని ప్రవేశపెట్టిందని అడిషనల్ కలెక్టరేట్ రాధిక గుప్తా అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశం మందిరంలో ఇందిరా మహిళా శక్తి పథకంపై డీఆర్‌డీఏ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా శక్తి పథకం ద్వారా స్వయం సహాయక సంఘాలకు రుణాలు అందించి, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తోడ్పాటునివ్వనున్నట్టు తెలిపారు. ఈ పథకం ద్వారా మహిళలు లబ్ధిపొందేందుకు అధికారులు కృషి చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో సాంబశివరావు, మెప్మా పీడీ అనిల్‌కుమార్, ఎల్ శివప్రసాద్, డీడబ్ల్యూవో కృష్ణారెడ్డి ఉన్నారు.

మానవ అక్రమ రవాణాను అరికడదాం..

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై సాంబయ్య

జవహర్‌నగర్, జులై 30: మానవ అక్రమ రవాణాను అరికట్టి, ప్రజలకు స్వేచ్ఛాయుత జీవనం అందిద్దామని యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఎస్సై సాంబయ్య విద్యార్థులకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జవహర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆశ్రమ్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు మానవ అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సాంబయ్య మాట్లాడారు.కార్యక్రమంలో ఆశ్రమ్ ఆర్గనైజేష్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ జీవన్, హెడ్ మాస్టర్ అజమోహినుద్దిన్, ఉపాధ్యాలు రాజేందర్, మల్లికార్జున్‌రావు, ఉషారాణి, సౌజన్య, స్వచ్ఛంద సంస్థ సిబ్బంది కాంతమ్మ, స్వప్న, అరుణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపులో పాల్గొన్న దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు

నేరేడ్‌మెట్, జూలై 30: ఆనంద్‌బాగ్ చౌరస్తాలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు మంగళవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి రవికుమార్ పర్యవేక్షణలో జరిగింది. మొత్తం 57 రోజుల హుండీ లెక్కింపు ద్వారా రూ. 3,01,083 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఏ.బి. రవీంద్ర రెడ్డి తెలిపారు.

రోడ్లు బురదమయం

చిత్తడిగా మారిన రోడ్డు

కీసర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డు బురదమయమైన దృశ్యం

కీసర, జూలై 30: చినుకు పడితే రోడ్లన్ని చిత్తడి చిత్తడిగా మారుతున్నాయి. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షాలకు పలు కాలనీల రోడ్లన్ని బురదమయంగా మారిపోవడంతో ఆయా బస్తీల్లోకి వెళ్లే ప్రజలంతా నానా అవస్థలు పడుతున్నారు. మట్టి పోసి చదును చేయాల్సిన అధికారులు పట్టిపట్టన్నట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కీసర మండల కేంద్రంలో ఉన్న సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళ్లే రోడ్డు కూడా పూర్తి బురదమయంగా మారిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బురదమయంగా మారిన రోడ్లపై మట్టి పోసి చదును చేయాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.

తిరుమలానగర్ ప్రభుత్వ పాఠశాలలో 'శిక్షా సప్త'

మల్లాపూర్, జూలై 30: మీర్‌పేట్ హెచ్‌బీకాలనీ డివిజన్ తిరుమలానగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో మంగళ వారం శిక్షాసప్త కార్యక్రమం నిర్వహిం చారు. కమ్యూనిటీ ఇన్‌వాల్వ్‌మెంట్‌లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌జీఓ ఆకృతి ప్రాజె క్టు ప్రతినిధి స్వాతి ఆధ్వర్యంలో డిజిటల్ లర్నింగ్ ప్రోగ్రామ్, 20 ల్యాప్ టాప్స్, 20 టేబుళ్లు, లైబ్రరీ బుక్స్‌తో పాటు 'యూత్ ఫర్ సేవ'కు చెందిన చరణ్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు బ్యాగులు అందజేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, జానకి, కుమారి అమ్మ, ఆదర్శ పాఠ శాల అధ్యక్షులు సంతోష , తిరుమలనగర్ కాలనీ అధ్యక్షులు మల్లేష్‌గౌడ్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు మురళీ కృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెరువులో మృతదేహం లభ్యం

శామీర్‌పేట,జూలై30: చెరువులో ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం ..శామీర్‌పేట చెరువులో వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికి తీశారు. కాప్రాకు చెందిన పున్నంపల్లి రామకృష్ణ(45)గా గుర్తించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రామకృష్ణ మృతదేహం.